జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 7 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 6



## గుమ్మడి నర్సయ్య జీవితం సినిమాగా రావడం...

- తెలంగాణ గర్వించదగ్గ విషయం-కల్వకుంట్ల కవిత.



**పాల్వంచ (టౌన్), డిసెంబర్ 06 (ప్రజా జ్యోతి):** గుమ్మడి నర్సయ్య జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రంతో దేశం మొత్తం తెలంగాణ ఉద్యమస్పూర్తిని తెలుసు కోనుండ నడం గర్వకారణమని ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవిత అన్నారు. సినిమా విడుద లకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. అవినీతి రహితంగా,మానవతా విలువలను కాపాడుతూ ప్రజలకు సేవ చేయడంలో గుమ్మడి నర్సయ్య ఎప్పుడూ

మిగతా 2 లో...







# ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్ బ్యానర్ పై ఘనంగా గుమ్మడి నరసయ్య సినిమా ప్రారంభోత్సవం..

**పెద్దమ్మ తల్లి దీవెనలు అందుకున్న రియల్ స్టార్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి...**

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్ బ్యానర్ పై చిత్రీకరిస్తున్న గుమ్మడి నరసయ్య సినీ పూజా కార్యక్రమం హెచ్ కన్వెన్షన్ హాల్లో శనివారం ఘనంగా జరిగింది. ముందుగా పాల్గొని చెప్పడానికి చేరుకున్న కన్నడ సినీ హీరో చిత్ర కథానాయకుడు శివ రాజ్ కుమార్ , గుమ్మడి నరసయ్యలు చేతుల మీదగా అంబేద్కర్ కు పూలమాల వేశారు. అనంతరం పట్టణ ప్రజల మధ్యలో భారీ ర్యాలీతో పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు, నల్ల సురేష్ రెడ్డి, సిని మాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి అమ్మవారి పూజలో పాల్గొన్నారు. హెచ్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన గుమ్మడి నరసయ్య సినీ పూజా కార్యక్రమంలో కథానాయ కుడు శివరాజ్ కుమార్, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిర్మాత నల్ల సురేష్ రెడ్డి, దర్శకుడు పరమేశ్వర్ హివ్రాలే, గుమ్మడి నరసయ్య, సంగీత దర్శకులు, సినీ ప్రముఖులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు నిర్మాత నల్ల సురేష్ రెడ్డి మాట్లాడుతూ తమ బ్యానర్ పై నిర్మించబడుతున్న తొలి చిత్రాన్ని ప్రేక్షకులు ఆద రిస్తారని, మంచి కథతో , గొప్ప నటీనటులతో గుమ్మడి నరసయ్య ప్రజల మనిషిగా, ఇప్పటికి ఎప్పటికీ ప్రజల్లోనే ఉంటారని ఈ చిత్రాన్ని నిర్మి స్తున్నామని తెలిపారు. తొలి సన్నివేశంలో ముఖ్యఅతిథిగా కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ సతీమణి గీత క్లాప్ కొట్టగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. సినీ షూటింగ్ షెడ్యూలు త్వరలో ప్రకటి స్తామని పాల్వంచ కిన్నెరసాని, ములుగు పలు ప్రాంతాల్లో ప్రారంభం కానున్నదన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కూన మనేని సాంబశివరావు,తెలంగాణ జాగృతి అధ్య క్షురాలు కల్వకుంట్ల కవిత, గుమ్మడి నరసయ్య కుమార్తె, సిపిఐ జిల్లా అధ్యక్షులు సాబీర్పాషా, ఎన్ఎస్ఆర్ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు వెంకట్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సందుబట్ల శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ యుగేందర్ రెడ్డి, పట్టణ ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిల్లు.... గుండె జల్లు....!

- లక్షల బిల్లు చూసి షాక్ అయిన విని యోగదారుడు.



**కొత్తగూడెం, డిసెంబర్ 6 (ప్రజాజ్యోతి):** ప్రతినెల వేలల్లో వచ్చే కరెంటు బిల్లు ఒక్కసారిగా లక్షల్లో రావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లోని అరుణ్ ఐస్ క్రీమ్ షాపు నిర్వాహకుడు అశోక్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. శనివారం రాత్రి అందుకున్న తాజా బిల్లు రూ. 12,35,191/-గా ఉండ టాన్ని చూసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు.గత నెలలో రూ. 40,063/-,అక్టోబర్ లో రూ. 37,192/-గా ఉన్న బిల్లు ఈ నెలలో అకస్మాత్తుగా లక్షల రూపాయలకు చేరడం గమనార్హం. "వెయ్యో, పది వేల రూపాయలు ఎక్కువగా వస్తే ఏదో అనుకోవచ్చు. ఇలా లక్షల్లో బిల్లు రావడం ఏమిటి?" అంటూ ...

మిగతా 2 లో...

### ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు
## బ్యాంకర్లు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్ డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** జిల్లాలో అమలు చేస్తున్న వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యాలు పూర్తిచేయడంలో బ్యాంకర్లు మరింత చురుకుదనంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శనివారం ఐడిఓసీ సమావేశ మందిరంలో డి.సి.సి, డి.ఎల్.ఆర్.సి సమీక్షా సమావేశంలో ఆయన బ్యాంకర్లు, జిల్లా శాఖాధికారులతో రుణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవ త్సరంలో ఏప్రిల్ –సెప్టెంబర్ మధ్య వివిధ రంగాల్లో రుణాల విడుదల వివరాలు వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు

మిగతా 2 లో...

## గుమ్మడి నర్సయ్య జీవితం సినిమాగా రావడం.





(మొదటి పేజీ తరువాయి...)

ఆదర్శంగా నిలిచారని కవిత పేర్కొన్నారు.నర్సయ్య జీవితం సినిమా రూపంలో తెలంగాణ సరిహద్దులు దాటి యావత్ దేశంలోకి వెళ్లడం గొప్ప విషయమని అభినందించారు.సినిమా డైరెక్టర్ పరమేష్ కామారెడ్డి జిల్లాకు చెందినవాడని చెప్పిన కవిత, "మన తెలంగాణ బిడ్డల ప్రతిభ జాతీయ స్థాయికి చేరడం గర్వంగా ఉంది" అని అన్నారు. శివరాజ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించడం సినిమాకు మరింత వన్నె తెచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు రాయితీలు ఇచ్చి సినిమా ప్రోత్సహించడం శ్లాఘనీయమని పేర్కొన్న కవిత,తమిళనాడు, మలయాళం,హిందీ భాషల్లో రాయితీ ఇవ్వకపోవడం దక్షిణాది సినిమాపై ఇంకా ఉన్న చులకన భావానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు.దిల్ రాజు వంటి సినీ పెద్దలు ముందుకు వచ్చి ఇతర భాషల్లో కూడా రాయితీల కోసం ప్రయత్నించాలని కోరారు.ఈ సినిమా యువతకు రాజకీయాలపై స్ఫూర్తి నింపుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 1969, 2001 తెలంగాణ ఉద్యమాల్లో పాల్వంచ,ఖమ్మం ప్రాంతాల్లో పాల్గొన్న అనేక మంది ఇప్పటికీ తగిన గుర్తింపు, అవకాశాలు పొందలేదని పేర్కొన్నారు.ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, అధికారానికి దూరంగా ఉన్న వర్గాలు, ముఖ్యంగా మహిళలను కలుపుకొని సామాజిక తెలంగాణ సాధించే దిశగా 'జనం బాట' పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించిన కవిత, సబ్బండ వర్గాలకు రాజకీయాల్లో ప్రాధాన్యం దక్కాలంటే సామాజిక తెలంగాణ అత్యవసరమని తెలియజేశారు.

## బిల్లు.. గుండె జల్లు ..!

(మొదటి పేజీ తరువాయి...)

ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సిబ్బంది నిర్లక్ష్యం లేదా మీటర్ /రీడింగ్ లో సాంకేతిక లోపం వల్లే బిల్లు పెరిగి ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు అశోక్ సిద్ధమయ్యారు. "అంత మొత్తం చెల్లించాల్సి వస్తే వ్యాపారం మూసుకోవాల్సిన పరిస్థితి" అని వాపోయారు.అధికారులు స్పందించి మరోసారి బిల్లును పరిశీలించి సరిదిద్దాలని స్థానికులు కూడా కోరుతున్నారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## అంబేద్కర్ కు నివాళులు అర్పించిన మల్లు నందిని విక్రమార్క

**కొత్తగూడెం, డిసెంబర్ 6 (ప్రజాజ్యోతి):** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో అంబేద్కర్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి...)

3899.28 కోట్ల లక్ష్యానికి గాను 2138.26 కోట్లు, ఎం ఎస్ ఎం ఈ రంగంలో 847.80 కోట్ల లక్ష్యానికి గాను 439.84 కోట్లు, విద్యా రుణాల్లో 6.96 కోట్లు, హౌసింగ్ లోన్లలో 10.84 కోట్లు, ఇతర రంగాల్లో 35.09 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు, మొత్తం లక్ష్యాల్లో 53.33 శాతం సాధించినట్లు తెలిపారు. రైతుల రుణ రేన్యూవల్ పై అవగాహన కల్పించి, వ్యవసాయ శాఖతో కలిసి బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, లబ్ధిదారులు సకాలంలో బ్యాంకులకు చెల్లించే విధంగా శాఖలు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో మునగ సాగు విజయవంతంగా కొనసాగుతుందనీ, ప్రస్తుతం రైతుల ఆర్థిక అభివృద్ధికి సమీకృత వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా తీసుకెళ్లే సమయం వచ్చిందని అన్నారు. ప్రత్యేకంగా చేపల పెంపకం యూనిట్ల స్థాపనపై వివరిస్తూ ఒక్క చేపల పెంపకం యూనిట్ స్థాపనకు సుమారు రూ.4.5 లక్షలు ఖర్చవుతుందని,అందులో చేప పిల్లల కొనుగోలు, ఫీడ్, ట్యాంకులు,షెడ్, ఏరేషన్ పరికరాలు, నిర్వహణ సామగ్రి వంటి అంశాలు ఉంటాయని, ఆధునిక బయోఫ్లాక్ టెక్నాలజీ, పాండ్–బేస్డ్ మోడళ్లతో ఈ యూనిట్లు సంవత్సరం పొడవునా ఆదాయం అందిస్తాయని వివరించారు.సరైన పద్ధతుల్లో చేపల పెంపకం చేపడితే ప్రతి 90–120 రోజులకు ఒక చక్రం పూర్తవుతూ, రైతులకు గణనీయమైన లాభాలు పొందే అవకాశం ఉందని, పెట్టుబడి కొద్దికాలంలోనే తిరిగివచ్చే అవకాశముందని తెలిపారు. కౌజు పిట్టల పెంపకం ద్వారా నెలకు 10,000 ఆదాయం వస్తుందని, కూరగాయల సాగు వంటి యూనిట్లతో కలిపి చేపల పెంపకం చేస్తే రైతుల నెలవారీ ఆదాయం మరింత పెరగగలదని అన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో చేపల పెంపకం రైతుల జీవన ప్రమాణాలను గణనీయంగా మార్చిన ఉదాహరణలను చూపిస్తూ, మన జిల్లాలో కూడా ఇదే మోడల్ అమలుచేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నచిన్న కారణాలతో రైతుల రుణ దరఖాస్తులను తిరస్కరించడం పట్ల కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి కోసం రుణాల మంజూరు కీలకమని, అనవసర ఆటంకాలు కలిగిస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు బ్యాంకులు ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. యూనిట్ల స్థాపనకు అనుమతి పొందిన దరఖాస్తులన్నీ మూడు రోజుల్లోగా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, రిజర్వ్ బ్యాంక్ అధికారి గౌతమి, ఎల్ డి ఎం రామి రెడ్డి, మెప్మా పీడీ రాజేష్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అన్ని బ్యాంక్ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## యస్.సి,యస్.టి, బి.సి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ వర్ధంతి



**దమ్మపేట, డిసెంబరు 6 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని మందలపల్లి రింగ్ సెంటర్లో భారత రాజ్యాంగ శిల్పి, స్వాతంత్ర్య సమర యోధుడు, దళిత బలహీన వర్గాల అభ్యుదయానికి నిరంతరం కృషి చేసిన మహానేత భారతరత్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వివిధ యస్.సి,యస్.టి, బి.సి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, ఆయన సేవలు, త్యాగాలు, సమానత్వం,న్యాయం స్థాపన కోసం చేసిన మహోన్నత కృషిని స్మరించుకున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగానే దేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు లభించాయని నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తంబళ్ల రవి, కొలికపొగు కాంతారావు, బండారి సూర్యనారాయణ, చెన్నారావు, ప్రసాద్, వేణు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో టిడిపి అంతర్గత నిర్ణయం

- **బి.ఆర్.యస్ పార్టీ బలబరచిన సర్పంచ్, వార్డ్ మెంబర్లల అభ్యర్థులకు టిడిపి మద్దతు**




**దమ్మపేట, డిసెంబరు 6 (ప్రజాజ్యోతి):** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని అశ్వారావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పార్టీ ఇన్చార్జ్ కట్రం స్వామి దొర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలకు సంబంధించిన ఎన్నికల పరిస్థితులు, అభ్యర్థుల వివరాలు,పార్టీ తీసుకున్న అంతర్గత నిర్ణయాలను ఆయన వివరించారు. గ్రామపంచాయతి స్థాయిలో ఏర్పడిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొన్ని స్థానాల్లో బి ఆర్ యస్ పార్టీ బలబరచిన సర్పంచ్,వార్డ్ మెంబర్లల అభ్యర్థులకు టిడిపి మద్దతు ఇవ్వాలనే నిర్ణయాన్ని పార్టీ అంతర్గత చర్చల అనంతరం వెల్లడించారు. ఈ నిర్ణయం పూర్తిగా స్థానిక పరిస్థితులు, గ్రామాభివృద్ధి అవసరాలు, అభ్యర్థుల సామర్థ్యాలను పరిశీలించిన తరువాత తీసుకున్నదని కట్రం స్వామి దొర తెలిపారు.ఈ సందర్భంలో నియోజకవర్గంలోని కార్యకర్తలు పార్టీ నిర్ణయాల గురించి తెలుసుకుని, స్థానిక ఎన్నికల నిర్వహణలో సయోధ్యతో వ్యవహరించాలని సూచించారు.

## పాల్వంచ మండలంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యింది

**పాల్వంచ (టౌన్ ), డిసెంబర్ 06 (ప్రజాజ్యోతి ):** పాల్వంచ మండల పరిధిలోని 36 గ్రామపంచాయతీలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. మొత్తం 36 పంచాయతీలలో 35 గ్రామపంచాయతీలకు నామినేషన్లు వచ్చినప్పటికీ, పాండురంగాపురం గ్రామపంచాయతీ నుంచి ఒక్క నామినేషన్ కూడా రాలేదు. సర్పంచ్ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం నాలుగు గ్రామపంచాయతీల్లో ఒక్కో నామినేషన్ మాత్రమే మిగిలిపోవడంతో అవి ఏకగ్రీవ పంచాయతీలుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అవి వరుసగా — సంఘం, బిక్కుతండా, తగిసిలగూడెం, ఇల్లందులపాడు తండా. వార్డుల వివరాలు మొత్తం వార్డులు: 282 ఒక్క నామినేషన్ కూడా రాని వార్డులు: 12 ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డులు: 62 31 గ్రామపంచాయతీలకు గాను పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు: 98 మంది 208 వార్డుల కోసం పోటీలో ఉన్న వార్డు సభ్యుల అభ్యర్థులు: 491 మంది. ఈ వివరాలను పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయభాస్కర రెడ్డి మీడియాకు వెల్లడించారు.

## అంబేద్కర్ రాజ్యాంగం అందరికీ సమానత్వం తెచ్చింది – ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, డిసెంబరు 6 (ప్రజాజ్యోతి):** భారత రాజ్యాంగ శిల్పి, మహానుభావుడు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమాజంలోని ప్రతి వ్యక్తి సమానత్వం, న్యాయం, విద్య, అభివృద్ధి పొందాలన్న మహోన్నత దృక్పథంతో డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, ఈ రాజ్యాంగం వల్లనే దేశ పౌరులందరికీ సమాన హక్కులు లభిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్య ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన, హక్కుల రక్షణ వంటి అంశాల్లో అంబేద్కర్ ఆలోచనలు భారతదేశానికి మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు కల్పించి, దేశ పురోగతికి పునాది వేసిందన్నారు.అంతేకాక, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పులి గుండా ప్రాజెక్ట్ వద్ద ఎర్రగుంట విద్యార్థుల ప్రకృతి సందర్శన

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపు






**అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనందకుమార్ ఆధ్వర్యంలో శనివారం తల్లాడ రక్షిత అటవీ పరిధిలోని పులిగుండాల పులి గుండా ప్రాజెక్ట్ ప్రకృతి విహార ప్రాంతాన్ని సందర్శించారు.సత్తుపల్లి డివిజన్ అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్ సురేష్ కుమార్ సిబ్బందితో కలిసి విద్యార్థులకు అడవుల అవసరం, వృక్షాలు లేకపోతే నేల ఎలా క్షీణతకు గురవుతుందో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ ప్రాంతంలో దాదాపు 200 రకాల పక్షి జాతులు ఉన్నాయని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పుష్పం ‘తంగేడు’, రాష్ట్ర పక్షి ‘పాలపిట్ట’లు ఈ ప్రాంతంలో అధికంగా కనిపిస్తాయని విద్యార్థులకు వివరించారు. పర్యావరణ సమతుల్యత కోసం కనీసం 33% అడవులు ఉండాలనే ముఖ్య అంశాన్ని వారు గుర్తు చేశారు.ఈ ప్రకృతి విహార యాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితో కలిపి మొత్తం 153 మంది పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శాంత కుమారి, రాజ్యలక్ష్మి , బి. వెంకటేశ్వరరావు, బాబూరావు, సునంద రెడ్డి, బాలు, జయరాం, మోతిలాల్, సుశీల, పద్మ, ప్రమీల రాణి, ప్రసాద్, శిరీష, బోధనేతర సిబ్బంది మీరా సాహెబ్,శ్రీనివాస్, ఖాసిం, సులోచన, అబేద, షాహిన, షాకీర్, ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు



**ఇల్లందు, డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సైదులు తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చల్ల సముద్రం పంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తాటి భిక్షంకు వ్యతిరేకంగా కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తున్న ఎల్లంపల్లి బుచ్చయ్య, సట్ల శ్రీను, మోడెం కోటయ్య, కాటూరి సతీష్ లను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. గత పదేళ్లలో టిఆర్ఎస్ పార్టీ చేయలేని పనులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలలో పనులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ రూ. 10లక్షలకు పెంపు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం వంటి మరెన్నో పథకాలను కొనసాగించడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు తాటి బిక్షం, దొంతు వెంకటేశ్వర్లు, యండి. సలీమ్, రమణ, నరాటి కోటి, నాగుల్ మీరా, మూతి బుచ్చయ్య, కుర్ర శ్రీనివాస్, కుర్ర అరుణ, మూతి చంద్రకళ, మూతి లక్ష్మయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అన్ని బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం-కొత్వాల



**పాల్వంచ(టౌన్),డిసెంబర్06(ప్రజా జ్యోతి ):** భారతరత్న,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సహా కాంగ్రెస్ నాయకులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ,దేశంలోని పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజల ఆరాధ్య దైవం అంబేద్కర్ అని పేర్కొన్నారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలు సహా సమాజంలోని అన్ని వర్గాలకు రాజ్యాంగ పరిరక్షణలు, హక్కులు కల్పించిన గొప్ప నాయకుడు అంబేద్కరన్నారు.ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు జాలే జానకిరెడ్డి,జెడ్పీ మాజీ చైర్మన్ బరపటి వాసుదేవరావు,మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్,మాజీ కౌన్సిలర్ కాల్వ భాస్కరరావు,కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్,కాపర్తి వెంకటాచారి,వాసుమల్ల సుందర్రావు,ఉండేటి శాంతి వర్ధన్,డిష్ నాగేశ్వరరావు,షేక్ చాంద్ పాషా,బావ్ సింగ్, సాంబయ్య,రత్నం, గుర్రం వెంకటరత్నం పాల్గొన్నారు.

# గిరిజన మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో 2.53 లక్షల చేప పిల్లల వదిలింపు



**పాల్వంచ(టౌన్), డిసెంబర్ 06(ప్రజా జ్యోతి ):** గిరిజన మత్స్య సొసైటీల ఆధ్వర్యంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఫిషరీస్ డిపార్ట్మెంట్ సహకారంతో మండలంలోని పలు నీటినిలయాల్లో మొత్తం 2,53,500 చేప పిల్లలను వదిలారు.మందరికలపాడు–రాళ్లవాగు ప్రాజెక్టు,కారేగట్టు–పికప్ డ్యామ్, ఉలవనూరు–లక్ష్మీదేవిపల్లి చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమం నిర్వహించారు.చేపల పెంపకం ద్వారా గిరిజనులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారి కృష్ణ, సొసైటీ చైర్మన్ కల్తి రమేష్,కార్యదర్శులు మోషే కుమార్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.సొసైటీ సభ్యులు ఈ కార్యక్రమంలో సక్రియంగా పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



**ఇల్లందు, డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా దిండిగల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ఆర్టికల్ 3 ద్వారా సానుకూలత ఏర్పర్చిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. ప్రతి భారతీయుడు గర్వంగా చెప్పుకునే నాయకుడు బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగనాథ్, అబ్దుల్ నభి, భావు సింగ్, డేరంగుల పోషం, ఉపేందర్, వీరస్వామి, లలిత్ కుమార్ పాసి, రవి, శ్రీను, మహేష్, ఇమ్రాన్, సర్దార్, శ్రీకాంత్, శివ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మానే ప్యానల్ గెలుపు కోరుతూ ఎమ్మెల్సీ ప్రచారం

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 6(ప్రజాజ్యోతి )** భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఎం,గోండ్వాన దండకారణ్యం పార్టీ, ఆదివాసి జేఏసీ మద్దతుతో బిఆర్ఎస్ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ, ఈ కూటమి వార్డు సభ్యుల విజయాలను కోరుతూ పట్టణంలోని 15,17 వార్డులో ఎమ్మెల్సీ తాత మధు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. భద్రాచలం గ్రామ సర్పంచిగా అన్ని అర్హతలు ఉన్న మానే రామకృష్ణ గెలిచి తీరుతారని ఆయన జోష్యం చెప్పారు. ప్రజలకు సేవ చేసే వారిని ప్రజలు గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ సూచించారు. ఆనాటి బిఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగా ఉపకరించాయో ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ పాలన ఎంత అస్తవ్యస్తంగా ఉందో ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఈనెల 11వ తేదీన జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో బిఆర్ఎస్ కూటమిని గెలిపించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ,స్థానిక నాయకులు వార్డ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలు





**ఇల్లందు, డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ సూచనల మేరకు శనివారం జేకే కాలనీలోని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సీనియర్ నాయకుడు సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, జెకె శ్రీనివాస్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు చూపిన బాటలోనే తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలన సాగిందన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడానికి రాజ్యాంగంలో బాబాసాహెబ్ చొరవతో ఏర్పాటుచేసిన ఆర్టికల్ 3 ఎంతగానో దోహదపడిందని తెలిపారు. అనంతరం జెకె కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కటకం పద్మావతి, తోట లలిత శారద, కడకంచి పద్మ, చీమల సుజాత, వాంకుడోత్ తార, నాయకులు నెమలి ధనలక్ష్మి , ఖమ్మం పాటి రేణుక, లాల్ సింగ్, కొక్కు సరిత, కడగండ్ల నారాయణమ్మ, పింకీ లోదు, రెహానా, డేరంగుల పోషం, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, చాంద్ పాషా, నీలం రాజశేఖర్, కావేటి రమేష్, వార రమేష్ కందాల రఘువీరారెడ్డి, బాసాని రాములు, మీర్జా బేగ్, గరికపాటి సంజీవరావు, లక్ష్మీనారాయణ, గుంటేటి రామస్వామి, వెన్నం కృష్ణార్జున, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మెడికల్ బోర్డు తీరుపై టీబీజీకేఎస్ నిరసన దీక్ష






**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 6 – ప్రజాజ్యోతి:** టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్జి1 జిఏం ఆఫీస్ ముందు ఒకరోజు నిరసన దీక్ష చేయడం జరిగింది. యాజమాన్యం తీరుపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్జీ 1 జిఎం ఆఫీస్ ముందు ఒకరోజు జరిగింది. గత రెండు సంవత్సరాలుగా సింగరేణి కార్మికుల పట్ల యాజమాన్యం మెడికల్ బోర్డు పైన వ్యవహరిస్తున్న శైలికి నిరసనగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన దీక్ష ఆర్ జీ వన్ జిఎం ఆఫ్ ఎదుట జరిగింది.ఈ దీక్ష కార్యక్రమం లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుగంటి చందర్, పుట్ట మధుకర్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు 80 శాతం సింగరేణి కార్మిక వర్గానికి కారుణ్య నియామకం కింద ఇన్వాల్యుడేషన్ చేయగా ఈ రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిన నాటి నుండి ఆరు బోర్డులు మాత్రమే నిర్వహించి అందులో ఒక బోర్డు రిఫరల్ ఫర్ హైయర్ సెంటర్ వారికి నిర్వహించి, ఎనిమిది నెలలు పైబడి అన్ఫిట్ లో ఉంచబడిన కార్మికులను 55 మందిలో ఐదుగురు మాత్రమే అన్ఫిట్ చేయడం అన్యాయమని అన్నారు. అదే రకంగా గుండె జబ్బులు పెరాల్సిస్ మరియు మూత్రపిండ వ్యాధులు లాంటి దీర్ఘకాల వ్యాధులతో 15 నెలల పైబడి అన్ఫిట్ లో ఉన్న కార్మికులను నవంబర్ నెలలో 130 బోర్డుకు పిలిచి సుమారు 23 మందిని మాత్రమే అన్ఫిట్ చేయడం దుర్మార్గమని తీవ్ర దీర్ఘ కాల వ్యాధులతో నడవలేని స్థితిలో, కదలలేని స్థితిలో ఉన్న కార్మికులను ఫిట్ చేయడం, ఫిట్ ఫర్ సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ ఇవ్వడం అన్యాయమని కార్మికుడు పని చేయలేని స్థితిలో కదలలేని స్థితిలో ఉంటే ఈ విధంగా వ్యవహరించడం వల్ల ఆ కుటుంబాలకు తీవ్రమైన అన్యాయం జరగడమేనని ఇటువంటి పరిస్థితుల పట్ల గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తూ మెడికల్ బోర్డు సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నాయని బోర్డు జరుగుతున్న లోపలను వెంటనే జులై నెలలో ,నవంబర్ నెలలో నిర్వహించిన మెడికల్ బోర్డులలో కార్మికులకు జరిగిన అన్యాయాన్ని సవరించడానికి మళ్ళీ ఒక మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి ఫిట్ చేసిన కార్మికులందరినీ బోర్డుకు పిలిచి అన్ఫిట్ చేయాలని డిమాండ్ చేసారు. ఆర్జి 1 ఏరియా జి ఏం ఆఫీస్ ముందు నిరసన దీక్ష చేయడం జరిగింది. ఈ దీక్ష కు టీబీజీకేఎస్ నాయకులు సురేందర్ రెడ్డి, రామ్మూర్తి, నూనె కొమరయ్య, పార్లపల్లి రవి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్, బోరింగ్ శంకర్, అశోక్, ఆంజనేయులు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించాలి

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల



**ఇల్లెందు, డిసెంబర్ 6, ప్రజాజ్యోతి:** రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల పేర్కొన్నారు. శనివారం ఇల్లెందులోని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి, ఐఎన్టియుసి సెంట్రల్ జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ దంపతుల ఇంటికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యావంతులు, ధనికులు ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. చాలామంది ఎన్నికలకు దూరంగా ఉండటం వల్ల ఓటింగ్ శాతం తగ్గుతుందని, ఫలితంగా రాజ్యాంగం కల్పించిన హక్కును కోల్పోతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని రెండు సంవత్సరాలలో చేసిందని పేర్కొన్నారు. యువత, మహిళలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. హైదరాబాద్ లాంటి మహానగరాల్లో సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఎన్నికల్లో ఓటు వేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారని అటువంటి వారు చైతన్యవంతులై ఓట్లు వేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. చాలామంది ఓటింగ్ లో పాల్గొనక పోవడం వల్ల దొంగ ఓట్లు పడుతున్నాయన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖలో పనిచేస్తున్న వారి సంక్షేమానికై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సాంస్కృతిక శాఖలో పనిచేసే వారికి హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, అంతేకాకుండా కళాకారులకు డప్పు, కీబోర్డ్, పాటలు పాడేవారికి శిక్షణను ఇస్తున్నామన్నారు. సాంస్కృతిక శాఖలో 584 మంది అవసరం ఉండగా ప్రస్తుతం 524 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. కొత్తగా మరో 500 మందిని నియమించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు, ఆ శాఖలో పనిచేసే వారికి మెడికల్ స్కీమ్ లు, డెత్ ఎక్స్ గ్రేషియా వంటి స్కీములను అమలుపరిచేందుకు ప్రభుత్వంతో చర్చించినట్లు తెలిపారు. గుమ్మడి నరసయ్య లాంటి ప్రజా సేవకుడి జీవిత చరిత్రను సినిమా రూపంలో తీస్తుండడం గర్వకారణమని, గుమ్మడి లాంటి రాజకీయ నాయకులు నేటితరం వారికి ఆదర్శప్రాయమన్నారు. తన తండ్రి గద్దర్ రాజ్యాంగ రక్షణకు ఓటు విలువను తెలిపేందుకు ఎంతో కృషి చేశారని వెల్లడించారు. అనంతరం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి సత్యనారాయణ దంపతులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మడుగు వెంకటలక్ష్మి లు సారె, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోచికొండ శ్రీదేవి, మడుగు వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి వేడుకలు

- మాల జన సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**అశ్వాపురం, డిసెంబర్ 6,ప్రజాజ్యోతి దినపత్రిక** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చెట్టి సురేష్ మాట్లాడుతూ భారత స్వతంత్ర సమరయోధుడు రాజ్యాంగ నిర్మాత దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుబడిన మహానేత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆ మహానీయుడు న్యాయ కోవిదుడు. ఆర్థికవేత్త భారత రాజ్యాంగంలో నిర్మాణంలో కీలక పాత్రధారి. ఆర్థిక సామాజిక న్యాయ రాజకీయ రంగంలో సమన్యాయం ఉండాలని ఆశించి భావితరాల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని అతి పెద్ద రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న అంటరానితనాన్ని పై పోరాడిన వీరుడు అంబేద్కర్ ఇవే మా ఘన నివాళులు ఈ కార్యక్రమంలో శ్రీ చరణ్. వెంకటేష్. సుశాంత్. సాయిరాం జస్వంత్. చందు. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మాలోత్ జానకి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కూనం నేని



**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 06(ప్రజా జ్యోతి ):** ఉప్పరి గూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మాలోత్ రామనాధం తల్లి మాలోత్ జానకి అకాల మరణ వార్త తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.మాలోత్ సెట్రాం నాయక్ కుటుంబాన్ని కలిసిన ఎమ్మెల్యే,కుటుంబ సభ్యులు రామచందర్,కిషన్,రామనాధం,రమేష్ రాథోడ్,విజయ,సుజాతకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## దుగినేపల్లిలో కాంగ్రెస్ పార్టీలో 10 కుటుంబాలు చేరిక

- పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం



**పినపాక,డిసెంబర్ 06(ప్రజాజ్యోతి ):** పినపాక మండలంలో 23 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం అన్నారు. శనివారం పినపాక మండలం దుగినేపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన సమక్షంలో 10 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు మెంబర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కేశవార్జున్, బోడ రమేష్, బిల్లం సాంబశివరావు, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధి నివారణలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

- దేవస్థానం ఈ.వో కె.దామోదర్రావు, డీసీహెచ్ఎస్ బి.రవిబాబు,




**భద్రాచలం టౌన్, డిసెంబర్ 6(ప్రజా జ్యోతి)** అంధత్వ నివారణకు, గిరిజన సంక్షేమం మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయం అందించడం కొరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం, లయన్స్ క్లబ్ జటావు, వికాస తరంగిణి, ఎన్.ఆర్.ఐ. వాసవి అసోసియేషన్ యుఎస్ వార్ల అధ్వర్యంలో 'పుష్పగిరి కంటి ఆసుపత్రి' సికింద్రాబాద్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరములో గడిచిన 18 నెలల్లో 1625 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించగా శనివారం ఆఖరి బ్యాచ్గా 250 మందికి కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, కె.దామోదర్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిహెచ్ఎస్ బి.రవిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు. అనంతరం దేవస్థానం ఈవో కె.దామోదర్రావు మాట్లాడుతూ ఈ శిబిరములో మారుమూల ప్రాంతం నుండి పేద ప్రజలు, వృద్ధులు కంటి చూపును పొందడం ఆనందకరంగా ఉందని, వీరికి కంటి చూపును ప్రసాదించిన స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం బి.రవిబాబు, డిసిహెచ్ఎస్ మాట్లాడుతూ 190 గ్రామాలకు చెందిన 1625 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమని, స్వచ్ఛంద సంస్థలు, ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ కృషిని అభినందించినారు.ఈ కార్యక్రమంలో భాగంగా డా.ఎస్.ఎల్.కాంతారావు డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్, ప్రోగ్రాం చైర్మన్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శ్రీజితేష్ వి. పాటిల్ వారి సహకారం, అనుమతితో ప్రాజెక్టు అధికారి ఐటిడిఎ భద్రాచలం శ్రీబి. రాహుల్ సహకారంతో కంటి శస్త్ర చికిత్సా శిబిరములు నిర్వహించినామని, ఆరోగ్యశ్రీ పథకం రక్తనిధి కేంద్రమునకు వర్తింపజేస్తూ, తలసేమియా, సికిల్సెల్ ఎనిమియాతో బాధపడుతున్న వారికి ఉచితంగా రక్త పరీక్షలు, రక్తం, మందులు ఉచితంగా అందించడం సాధ్యపడుతుందని, వారికి ధన్యవాదాలు తెలిపినారు. ఈ శిబిరము నిర్వహించుటకు ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ యుఎస్ఏ ఆర్థిక సహాయం అందించినారని, ఎన్ఆర వాసవి అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ బప్పనపల్లి, ఆర్. వాసుదేవ్, బి. మల్లిఖార్జున్, కె.శ్రీనివాస్, శ్రీరామ్ రంగారావు గార్లకు ధన్యవాదాలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో డా.ఎస్.ఎల్.కాంతారావు బిఆర్సీఎస్ జిల్లా కోఆర్డినేటర్, జి. రాజారెడ్డి, డా.లయన్ కమలా రాజశేఖర్, లయన్ నక్కా వెంకన్న యాదవ్, తిప్పన సిద్దులు, చారుగుళ్ళ శ్రీనివాస్, డా వి. కామేశ్వరరావు, కురిచేటి రాము, కురిచేటి శ్రీనివాస్, లయన్ గోళ్ళ భూపతిరావు, లయన్ గట్టు వెంకటాచారి, లయన్ యం.సిద్దా రెడ్డి, రాములు, నర్సింహాచారి, ఆదినారాయణ, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చూడండి

- చర్ల మేజర్ సర్పంచ్ అభ్యర్థి సోయం కృష్ణవేణి



**చర్ల, డిసెంబర్ 06: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా శనివారం బిఆర్ఎస్ పార్టీ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలపరిచిన చర్ల మేజర్ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థి సోయం కృష్ణవేణి ప్రచార జోరును కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సోయం కృష్ణవేణి మాట్లాడుతూ చర్ల మండల ప్రజలు నన్ను ఆశీర్వదించవలసిందిగా కోరుతూ తన ఎన్నికల గుర్తు ఉంగరమని ప్రతి ఒక్కరు మీ అమూల్యమైన ఓటుని ఉంగరం గుర్తు పై వేయవలసిందిగా కోరారు. చర్ల మండల అభివృద్ధికి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చూడండి అంటూ చర్ల మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని సమస్యలకై పరిష్కారానికి కృషి చేస్తానని గతంలో కలిగిన తన రాజకీయ అనుభవంతో సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తూ చర్ల మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రభుత్వ పథకాలను ప్రతి పేదవాడికి అందేలాగా చూస్తానని నిష్పక్షపాతంగా మండల అభివృద్ధిలో తమ వంతు కృషి చేస్తానని అన్నారు. ఇంటింటికి ప్రచారం చేస్తూ తమ ఎన్నికల గుర్తు ఉంగరాన్ని మండల వాసులకు వివరిస్తూ ముందుకు సాగుతూ తనకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించవలసిందిగా కోరుతున్నారు . చర్ల సమస్యలైనా దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు, డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సమస్య, వీధిలైట్లు, రహదారుల నిర్మాణం వంటి మొదలగు సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని ఏ సమస్య వచ్చినా ప్రజలకు తమ వంతు సాయం అందిస్తానని మండల అభివృద్ధికి పాటు పడతానని చర్ల మండల వాసులను తన ప్రచారంలో కోరడం జరిగినది.

## రత్నం కవిత ఇంటింటా ప్రచారం

- వార్డు అభివృద్ధి నా ధ్యేయం, 16 వ వార్డ్ అభ్యర్థి రత్నం కవిత



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 6,(ప్రజాజ్యోతి)** భద్రాచలం పట్టణంలో జరిగే మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 16 వ వార్డ్ అభ్యర్థి రత్నం కవిత ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 16 వార్డ్ ఓటర్లు అందరు తమ విలువైన ఓటు వేసి గెలిపించినట్లయితే అభివృద్ధి చేసి చేసి చూపిస్తా అని అన్నారు అలాగే 16వ వ వార్డును భద్రాచలం గ్రామ పంచాయితీలో ఒక మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను. చెత్తా, చెదారం ఎక్కడా నిల్వ లేకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి దోమ కాటు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ఫాగ్ స్ప్రే చేస్తూ,వార్డు పరిధిలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేనిచోట ఏర్పాటుకు కృషి చేస్తాను అని,విద్యుత్ దీపాలు ఎప్పుడు మరమ్మత్తులుకు గురైనా వెంటనే ఏర్పాటుకు కృషి చేస్తాను అని, 16 వ వార్డులో ఉన్న ప్రజలకు త్రాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తాను అని అన్నారు.వార్డులోని ప్రజలకు ఏలాంటి సమస్య ఎదురైనా మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేస్తాను. వార్డులో ఒక కమిటీ ఏర్పాటు చేసి కమిటి ద్వారా 2 నెలలకు ఒకసారి వార్డులో సభ ఏర్పాటు చేసి వార్డులోని సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలను చూపించేందుకు కృషి చేస్తానని,ఒక్క అవకాశం ఇచ్చి ఈలా గుర్తుపై ఓటు వేసి గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా అని కోరుకుంటున్నారు. ప్రచార కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య శ్వేత, ముంతాజ్, రమాకాంత్, బోడ వీరన్న, చేగుండి, శ్రీనివాసరావు, ధర్మ, పసుపులేటి ఆనంద్ పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి



**చర్ల, డిసెంబర్ 06: (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో శనివారం భారత రాజ్యాం గ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చర్ల మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా సిపిఎం జి ల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మా ట్లాడుతూ దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే అంబేద్కర్ కు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. దేశంలో బిజెపి మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, అణగారిన వర్గాల పైన దాడులు పెరిగాయని, అత్యాచారాలు పెరిగాయని అన్నారు. ప్రజల పైన భారాలతో పాటు కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం వలన దేశం ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తుందని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం కోసం అనేక విధానాలు తీసుకుంటున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే వ్యక్తులు, శక్తులపైన ప్రతిపక్షాల పైన నిర్బంధాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. పోరాడే శక్తులకు వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం అనేక కుట్రలు కుతంత్రాలు చేస్తుందని తద్వారా మతోన్మాద చర్యలు పెంచుతున్నారని అన్నారు. దేశంలో ఈనాడు కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తులు ఏకమై ప్రజలపై దాడి చేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగఫలాలు అణగారిన వర్గాలకు చేరటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయిఅని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ ఫలాలు పీడిత వర్గాల అభ్యున్నతి కోసం ఉపయోగపడే విధంగా చైతన్యవంతమైన పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని దళితులు సామాజిక న్యాయం సాధించాలంటే పోరాటాలు తప్పవని అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బ్రహ్మచారి ఆర్ శ్రీనివాస్, మండల కార్యదర్శి మచ్చ రామారావు మండల నాయకులు బందేల చంటి, పి సమ్మక్క, నవీన్, వరలక్ష్మి, బందారు నరసింహ, స్పందన తదితరులు పాల్గొన్నారు.

## చర్ల మండల అభివృద్ధికి కృషి చేస్తా

- చర్ల మేజర్ సర్పంచ్ అభ్యర్థి బేతంచెర్ల నర్స వేణి



**చర్ల, డిసెంబర్ 06: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బిజెపి సీనియర్ నాయకులు, జనసేన పార్టీ ,తెలంగాణ ఉద్యమకారులు బలపరిచిన చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బేతంచర్ల నర్సవేణి తన ఎన్నికల ప్రచారంతో విస్తృతంగా ముందుకు సాగుతున్నారు .ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బేతంచర్ల నర్సవేణి మాట్లాడుతూ చర్ల మండల అభివృద్ధికి తన వంతు తాను కృషి చేస్తానని మండలంలో మార్పు అవసరమని మార్పుతోనే మండలం అభివృద్ధి చెందుతుందని మీ అమూల్యమైన ఓటుని బ్యాటు గుర్తుపై వేసి పంచాయతీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించవలసిందిగా కోరారు .గతంలో పనిచేసిన అభ్యర్థులు మండలంలోని సమస్యలపై దృష్టి సారించలేదని మండలవాసులు మార్పు కోరుతూ నన్ను గెలిపించినట్లయితే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ చర్ల మండలాన్ని ఆదర్శ మండలంగా రూపు దిద్దుతానని అందరికీ అందుబాటులో ఉంటానని కావున మండల వాసులు ఆలోచన చేసి బ్యాటు గుర్తుపై ఓటు వేసి మార్పు కోరుతూ తనకు అఖండ విజయాన్ని చేకూర్చాలని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో బేతంచెర్ల నర్స వేణి ప్రచారం సాగిస్తూ బిజెపి పథకాలను ప్రజలకు వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ తనను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించవలసిందిగా కోరారు.

## ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : డిఎస్పీ

- సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్




**కొత్తగూడెం, డిసెంబర్ 6(ప్రజాజ్యోతి):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చుంచుపల్లి రామాలయం నుండి బైపాస్ రోడ్డు వరకు కొత్తగూడెం సబ్ డివిజన్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు.పంచాయితీ ఎన్నికల సందర్భంగా జరగనున్న పోలింగ్ ను ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు డిఎస్పీ రెహమాన్ తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని అన్నారు.ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మద్యం,నగదు మరియు ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఎం, టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న



**పినపాక,నవంబర్ 06(ప్రజాజ్యోతి ) :** బోటిగూడెం గ్రామపంచాయతీలో సిపిఎం, టిఆర్ఎస్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నూపా బాపనమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీ, సిపిఎం నాయకులు విస్తృత ప్రచార నిర్వహిస్తున్నారు. శనివారం పినపాక మండలం బోటుగూడెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుపై ఓటు వేసి బాపనమ్మను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి దుబ్బ గోవర్ధన్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు రమేష్, బిఆర్ఎస్ నాయకులు కొండేరు రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి



**కొత్తగూడెం, డిసెంబర్ 6 (ప్రజాజ్యోతి):** మున్సిపాలిటీ పరిధిలోని రామ టాకీస్ ఏరియా 28వ వార్డులో శనివారం తెలంగాణ దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బీరా రవీందర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక గొప్ప మహానీయుడు రాజ్యాంగ రచయిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, కుమారి, తమ్మారావు, పాసి రామ్ కుమార్, ఆశా బాయ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## న్యూ డెమోక్రసీ అభ్యర్థులను గెలిపించండి : ఆవు నూరి మధు





**గుండాల ప్రజా జ్యోతి 6.** గుండాల మండలంలో పోటీ చేస్తున్న న్యూ డెమోక్రసీ అభ్యర్థులను గెలిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవు నూరి మధు అన్నారు శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా న్యూ డెమోక్రసీ పనిచేస్తుందని అందులో భాగంగానే మండలంలోని పోడు భూములు చెరువులు కుంటలు కరెంటు రోడ్లు పోరాటాల ద్వారానే సాధించుకోవడం జరిగిందని అందులో భాగంగానే ఈ ప్రాంత సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ బాటన్న కోటన్న కొండన్న లింగన్న లాంటి వీరులు నేలకొరిగారని వారి అడుగుజాడల్లో న్యూ డెమోక్రసీ పనిచేస్తూ ప్రజలను ఐక్యం చేస్తుందని న్యూడెమోక్రసీలో పని చేస్తూ నేడు పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు ఇంతకుముందు గెలిచిన ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం కీలక పాత్ర పోషించారని పైసా ఆశించకుండా అభివృద్ధి లక్ష్యంగా పనిచేశారని ప్రజలు గమనించి సర్పంచులను వార్డు సభ్యులను గెలిపించాలన్నారు ప్రజా సమస్యలపై పోరాడే కొట్లాడే గొంతుకను నిలబెట్టి స్వార్ధపర శక్తులను ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు ప్రజా వ్యతిరేకులు దోపిడి ద్వారాలు డబ్బులు మందు మాంసం టక్కు టమారాలతో ముందుకు వస్తారని ప్రజలు గమనించి వీరిని తిప్పి కొట్టాలన్నారు అనునిత్యం ప్రజల మధ్య ఉంటున్న ప్రజా నాయకులు అభ్యర్థులను గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థులు కోరం సీతారాములు పాయం ఎల్లన్న పరిషత్ రవి గుగ్గిల సౌజన్య పూనమ్ విజయ ఇర్ప రాజేష్ జరుపుల కిషన్ గొట్టం అశ్విని ఆ పార్టీ నాయకులు యాసారపు వెంకన్న పెండేకట్ల పెంటయ్య మంగమ్మ లాలయ్య లాలు ఉపేందర్ ఈసం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి ఘన నివాళి



**చర్ల, డిసెంబర్ 06: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం భారత రత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ .బి ఆర్ .అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భగా పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్టాండ్ సెంటర్ నందు ప్రచారం చేస్తూ బిజెపి పార్టీ బలపరిచిన పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎట్టి ఆమనికి తమ అమూల్య మైన ఓటును ఫుట్ బాల్ గుర్తు పై వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని ఆమె కోరారు. కేంద్ర ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ పధకాలే తనకు శ్రీరామరక్ష అని చర్ల పంచాయతీ కార్యాలయం పై ఈ సారి బీజేపీ జెండా ఎగరడం ఖాయం అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు గునూరి రమణ. బాబా ఫహీం. మండల నాయకులు నూప రమేష్ సరియం ధర్మ రాజు. ముత్తారపు. శ్రీనివాస చారి. వెంబడి హరినాథ్ పర్సిక వినయ్ చుక్క శివ. మడి శంకర్. యర్రం లక్ష్మి నారాయణ.వాకా రమేష్. తేగడ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బోడిక సందీప్. ఐర్ప విజయ్ కాంత్. ఎస్ . సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన సదస్సులు



**దమ్మపేట, డిసెంబరు 6 (ప్రజా జ్యోతి ):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి ,ముష్టిబండ గ్రామపంచాయతీల్లో శనివారం దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి ఆద్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామస్థులు, ఎన్నికల పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులు, కార్యకర్తలకు ఎన్నికల ప్రక్రియ, ఆచరణ వ్యవస్థ ,పోలింగ్ రోజున పాటించాల్సిన నియమాలు గురించి సమగ్రంగా వివరణ ఇచ్చారు. సదస్సులో మాట్లాడిన దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, స్వచ్ఛమైన, నిష్పాక్షిక ఎన్నికలు నిర్వహించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలింగ్ రోజు అనవసర గుంపులు, అనుచిత ప్రచారం, డబ్బు లేదా ఇతర ప్రలోభాలకు గల అవకాశం లేకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో చట్టం అందరికీ సమానమని, ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అభ్యర్థులు మరియు వారి ప్రతినిధులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించడం అత్యవసరమని, గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు పౌరులు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలింగ్ బూత్ పరిసరాల్లో 48 గంటల ముందు నుండి మద్యం నిషేధం, బూత్‌లో మొబైల్ ఫోన్ల వినియోగం, ప్రచార వాహనాలపై నియంత్రణ వంటి పలు అంశాలను వివరంగా తెలియజేశారు.గ్రామ పంచాయతి ప్రజలకు తమ ఓటు హక్కు విలువను చెప్పి, ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల రోజు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామపంచాయతి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘంటసాల 103వ జయంతి వేడుకలు జయభేరి మోగించనున్నాయి




**పాల్వంచ (టౌన్),డిసెంబర్ 06(ప్రజా జ్యోతి ):** సంగీతమూర్తి ఘంటసాల వెంకటేశ్వరరావు గారి 103వ జయంతి సందర్భంగా ఖాసిం మెగా ఈవెంట్స్, శ్రీ వెంకటేశ్వర కళానాట్య మండలి అధ్యక్షుడు భాష మరియు పాల్వంచ కళాకారుల ఆధ్వర్యంలో డిసెంబర్ 7,ఆదివారం నాడు జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.ఈ కార్యక్రమం పాల్వంచ కేటీపీస్ పరిధిలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడనుంది.ఘంటసాల కళా వైభవాన్ని స్మరించుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు,సంగీత వినోదాలు, ఘంటసాల గేయాలు కళాకారుల ద్వారా ప్రదర్శించబడనున్నాయని తెలిపారు.పాల్వంచ ప్రాంతంలోని అన్ని కళాకారులు,సంగీతాభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఈ మెగా ఘంటసాల జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఆశ కార్యకర్త పదవికి రాజీనామా చేసి పంచాయతీ బరిలో

- **చాతకొండ సర్పంచ్ అభ్యర్థిగా వజ్జా ఈశ్వరి**



**కొత్తగూడెం, డిసెంబర్6 (ప్రజా జ్యోతి)** లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ గ్రామానికి చెందిన వజ్జా ఈశ్వరి ఆశ కార్యకర్త ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్ బరిలో నిలిచింది. ఉమ్మడి చాతకొండ పంచాయతీ మొట్టమొదటి సర్పంచ్ గా పనిచేసిన స్వర్గీయ మాజీ సర్పంచ్ వజ్జా సీతారాములు భార్యగా అందరికి సుపరిచితురాలైన వజ్జా ఈశ్వరి భర్త బాటలో ప్రజా సేవ చేసేందుకు పంచాయతీ బరిలో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తగా ఉంటూ ఎంతో మందికి సేవలందించానని, కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ఆశీస్సులతో సిపిఐ పార్టీ బలపరిచిన తనను సర్పంచ్ గా గెలిపిస్తే ప్రజలకు మరిన్ని సేవలందిస్తానని, గ్రామ పంచాయతీలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడమే కాక అందరికి అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు.

## గౌతమ్ బుద్ధ సేవా సంస్థ ఆద్వర్యంలో నిరుపేదకు గౌరవప్రద అంత్యక్రియలు




**దమ్మపేట, డిసెంబరు 6 (ప్రజా జ్యోతి ):** దమ్మపేట మండలం,మందలపల్లి గ్రామానికి చెందిన నిరుపేద సుంకెల్లి వెంకటేశ్వరరావు (50) అనారోగ్యంతో మృతి చెందగా, దమ్మపేట మండల గౌతమ్ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ముందుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాలడుగు అబ్బులు మాట్లాడుతూ, మందలపల్లికి చెందిన అజీమ్ తన జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చికెన్ షెడ్‌లో అనాథలకు, నిరుపేదలకు అంత్యక్రియలు నిర్వహించడానికి అవసరమైన సామాగ్రి, ఫ్రీజర్ బాక్స్‌లను సిద్ధంగా ఉంచి, వాటికి తన షెడ్‌లో ఆశ్రయం కల్పిస్తున్నారని తెలిపారు.అంత్యక్రియల అనంతరం భోజన సదుపాయాలు శ్రీ దేవరపల్లి అజయ్‌కుమార్, మందలపల్లి ఆటో యూనియన్ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా సేవ చేయాలనుకునే దాతలు సంస్థ సభ్యులను సంప్రదించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ అజీమ్, రొయ్యల కుమార్, గంగాధర శ్రీనివాస్, షేక్ బుడే, తిమోతి, జాను, తెలంగాణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చు వివరాలు సక్రమంగా నిర్వహించండి.

- **జిల్లా పరిశీలకులు లావణ్య.**



**గుండాల ప్రజా జ్యోతి 6.** అభ్యర్థుల ఖర్చు వివరాలను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను ఎన్నికల జిల్లా వేయ పరిశీలకులు లావణ్య కోరారు శనివారం గుండాల మండలంలో పర్యటించిన అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు ఎన్నికలు సక్రమంగా నిర్వహించేలా జరిగేలా చర్యలు తీసుకుంటూ అభ్యర్థుల వేయ ఖర్చు వివరాలను రికార్డ్ మెయింటినెన్స్ చేయాలని కోరారు సంబంధిత శాఖ అధికారులను వివరాల అడిగి తెలుసుకొని తగు సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు తాసిల్దార్ కాసిం ఎస్సై సైదా Rahoop ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు